క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సోంపురంపాఠశాలలో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రాజు

వేపాడ: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి.పి.ఎ.రాజు సూచించారు. సోంపురం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అలాగే ఎంఈఓ–2 బాలభాస్కరరావు రామస్వామిపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో అధిక శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సర్పంచ్ క్రాంతికుమార్

దత్తిరాజేరు: మండలంలోని టి.భార్గవలస గ్రామంలో సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ తన సొంత నిధులతో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 40 మంది మహిళలకు 60రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సర్పంచ్ తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. శిక్షకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్



సంగం వీధిలో తాగునీటి కుళాయిను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని సంగం వీధి, చిక్కాలవీధి, బ్రాహ్మణ వీధి, కోమటి వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.32.లక్షలతో ఈ వీధుల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని వీధుల్లో పనులు పూర్తయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు, జేఈ యు.చంద్రకళ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తాగునీటి పథకం నుంచి అదనపు పైపు లైన్‌లు వేసి ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు. కుళాయిలు ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిరుధాన్యాల సాగు పరిశీలన



గంటి పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

కొత్తవలస: సబల సంస్థ, వ్యవసాయశాఖ సహకారంతో గనిశెట్టిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో చేస్తున్న చిరుధాన్యాల సాగును ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ ఆధికారి హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ఒకే పంట కాకుండా బహుళ పంటలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం ఆర్జించవచ్చని చెప్పారు. బహుళ పంటల సాగుతో భూసారం పెరుగుతుందని, జీవవైవిధ్యం ఏర్పడి భూమిలోపల కర్బన స్థాపన జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు మరింత చేరువ

- 'జగనన్న సురక్ష' లో ఎమ్మెల్యే కడుబండి



గుర్ల: చింతలపేటలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



వేపాడ: రామస్వామిపేటలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



బొండపల్లి: కనిమెరకలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



గుర్ల: తెట్టంగిలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న నాయకులు సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రామస్వామిపేట, కొండగంగుబూడి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపు లకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ప్రజలకు వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నెలకొల్పిన గ్రామ సచివా లయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఊళ్లలోనే అందుతున్నా యని చెప్పారు. ఇంకా ఎవరికైనా ఆదాయ, కుల, జనన, భూహక్కు, రేషన్ కార్డులు, కౌలు గుర్తింపు కార్డులు తదితర ధ్రువపత్రాలు కావాలంటే వారికి ఇంటివద్దకే ఉచితంగా అందించేందుకు, అర్హత ఉండి సాంకేతిక కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే ఆ సమస్యలను పరిష్కరించి పథకాలు మంజూరు చేసేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతు న్నాయని చెప్పారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పట్నాయక్, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జి మెరపల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, సర్పంచ్‌లు బంగారయ్య, వడ్లమాని శర్మ, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ప్రయోజనం

గుర్ల: 'జగనన్న సురక్ష' కార్యక్రమంతో ప్రజలందరికీ ప్రయోజనం చేకూరుతోందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యద ర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని చింతలపేట, తెట్టంగి గ్రామాల్లో శుక్రవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు. ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రా లను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. మండల జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోళ్ల సుబ్రహ్మణ్యం, జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

బొండపల్లి: ప్రజాసమస్యల పరిష్కారం, అర్హులందరికీ పథకాలు మంజూరు చేయడమే ధ్యేయంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నా మని ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తెలిపారు. మండలంలోని కనిమెరక, బొండపల్లి–2 సచివాలయాల పరిధిలో శుక్రవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు. ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.జి.ఎస్.ఎం. ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, కనిమెరక, బొండపల్లి గ్రామాల సర్పంచ్‌లు సిరిపురం ఆదినారాయణ, బొండపల్లి ఈశ్వరరావు, నాయకులు కర్రి కృష్ణ, బోడసింగి జగదీశ్వరరావు, కోళ్ల వెంకటరమణ, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు..

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం, కొత్తవలస సచివాలయం–1 పరిధిలో 'జగనన్న సురక్ష 'క్యాంపులు శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళపాలెం గ్రామంలో ఎంపీడీఓ వై.పద్మజ, కొత్తవలస సచివాలయం–1 పరిధిలో తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా ఆధ్వర్యంలో ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: మండలంలోని రేగ, పోతంపేట గ్రామాల్లో శనివారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు తెలిపారు. రేగలో తహసీల్దార్ జి.ఆదిబాబు, పోతంపేటలో ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలోఈకార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతుల పక్షపాతిగా మారిపోయారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక లాంటి వాడని అటువంటి రైతులు ఏడాదంతా ఎటువంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గల టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పడిన కష్టాలను స్వయంగా చూసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆకష్టాలను పూర్తిగా తొలగించేందుకు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేసి చూపించారన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆగిపోయిందని పచ్చపత్రికల్లో వెలువడిన వార్తను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తీవ్రంగా ఖండించారు. పచ్చపత్రికలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి, ఎన్ని పిచ్చిరాతలు రాసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఘంటాపథంగా చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ము త్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి. వెంకటరావు, పార్టీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మ ండల సురేష్, కడుపుట్ల పైడిపునాయుడు, సోషల్ మీడియా నియోజకవర్గం కన్వీనర్ పొటిపిరెడ్డి నారాయణ మూర్తి, కె.రామునాయుడు, నాయుడు, పి.ప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుత్ నెట్‌వర్క్ మరింత పటిష్టం

- విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు



రేగ సమీపంలోని ఫుడ్‌ప్రోసెసింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో మార్పులు చేసి విద్యుత్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేయాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని ఆశాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్(ఎస్ఈ) బి.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, విద్యుత్ వ్యవస్థ, పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా విద్యుత్ లైన్‌లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖా స్తులు అందితే వెంటనే మంజూరు చేసి పనులను పూర్తి చేయాలన్నారు. వర్షా కాలంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం నూతనంగా విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న రేగ గ్రామ సమీపంలోని ఫుడ్ ప్రోసెసింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. డీఈ సురేష్‌బాబు, ఏడీ బి.వెంకటరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వే



చీపురుపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్



జామిలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

చీపురుపల్లి: ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వేను బీఎల్‌ఓలు (బూత్ లెవెల్ ఆఫీసర్స్) సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.సురేష్ సూచించారు. పట్టణంలోని 144 పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు శుక్రవారం నిర్వహించిన ఇంటింట ఓటర్ల జాబితా సర్వేను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు కొత్త ఓటర్ల జాబితా తీసుకుని తమ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లాలన్నారు. ఆ ఇంటిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, వారి పేర్లు, చిరునామా, పోలింగ్ కేంద్రాల వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అన్నది ఓటర్ల సమక్షంలో పరిశీలించాలన్నారు. మృతి చెందిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు ఉంటే ఆ వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన కోసమే ఎన్నికల కమిషన్ ఈ సర్వే నిర్వహిస్తోందని, ఓటర్లు సహకరించాలని కోరారు. ఆయన వెంట వీఆర్‌ఓ సలీమ ఉన్నారు.

సర్వే పరిశీలన

జామి: మండల కేంద్రంలో బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాపై శుక్రవారం నిర్వహించిన ఇంటింట సర్వేను తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆగస్టు 21వ తేదీ వరకు సర్వే చేయనున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దడం, కొత్త ఓటర్ల నమోదు, సవరణలు చేపడతామన్నారు.

అర్హులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న భీశెట్టి బాబ్జీ, విద్యార్థులు

చీపురుపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ఓటుతోనే వ్యవస్థలో మార్పులు సాధ్యమని ఓట్ ఇండియా రాష్ట్ర క్యాంపెయిన్ అధ్యక్షు డు భీశెట్టి బాబ్జీ అన్నారు. పట్టణంలోని సత్యరామ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో సేవ్ డెమోక్రసీ చైతన్య సదస్సు శుక్రవారం నిర్వహించారు. అంతకుముందు కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు యువతే మూలస్తంభాలని అన్నారు. ఓటర్ల జాబితాపై ఎన్నికల కమిషన్ ఇంటింట సర్వే చేయిస్తోందని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎ.జగదీష్, త్రిశూల్ రమణ స్కూల్స్ అధినేత వి.ఎస్.ఎన్.కుమార్, ఎస్.వి.ఎన్.బ్లడ్ బ్యాంక్ అధినేత నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



గజపతినగరం: శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ



దత్తిరాజేరు: పెదమానాపురంలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

గజపతినగరం: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్యజాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల ని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ సూచించారు. గజపతినగరం గ్రామ సచివాలయం–1 పరిధిలో శుక్రవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 87 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు. చాలా వ్యాధులకు దోమలే కారణమని వీటి నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నివాస ప్రాంతాల చుట్టూ నీటి నిల్వలు, కొబ్బరి బొండాల చిప్పలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు వైద్యాధికారి అవగాహన కల్పించారు.ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త సునీత, ఆశ కార్యకర్తలు కనకరత్నం, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెదమానాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 52 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న రోగులకు వైద్యసేవలు అందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యాగాటి లక్ష్మిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు వలస వెళ్లి పోగా, వారు ఉపాధి పనులకు హాజరైనట్లు మస్తర్లు వేశారని అదే గ్రామానికి చెందిన వ్యక్తి 'జగనన్నకు చెబుదాం' హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఏపీడీ జనార్దన్ విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఆ నివేదిక ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు.

యోగాతో ఏకాగ్రత



యువకులకు యోగా శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సుజాత

చీపురుపల్లి: నిత్యం సాధన యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా లక్ష్యాలను సాధించవచ్చని శ్రీ చైతన్య యోగా కేంద్రం వ్యవస్థాపకరాలు గవిడి సుజాత అన్నారు. పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్మీ కొలువల కోసం సిద్ధమవుతున్న యువతకు పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

జామి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భీమసింగి జంక్షన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన బాబు, నాయకులు హర్ష, రవి మాట్లాడుతూ మండలంలో విద్యార్థుల కోసం బస్సు సర్వీసులు పెంచాలని కోరారు.ప్రైవేటు కళాశాలలకు మండల విద్యార్థులు ఫీజులు కట్టలేకపోతున్నారని, జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

శృంగవరపుకోట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంతోషం, పేదరికం రూపుమాపడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యాక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతీ ఇంటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరాతీశారు. సీఎం జగన్ సందేశం, పథకాల లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఇంటింటికీ అందజేశారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ చిట్టిపోలు మంగ, ఎంపీటీసీ జి.సన్యాసప్పుడు, వైస్ సర్పంచ్ కె.గంగేశ్వరరావు, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు అల్లు సుధీర్, నాయకులు మజ్జి శేఖర్, కె.వెంకటరావు, ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

కొత్తవలస: మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వేదపండితులు శర్మ 50 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిషా, డీన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



గజపతినగరం: తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు



బొండపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

గజపతినగరం/బొండపల్లి: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి సూచించారు. గజపతినగరం, బొండపల్లి తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా మండలా ల్లోని వీఆర్‌ఏలతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. అర్హత ఉన్న వారికి వీఆర్‌ఓలుగా పదోన్నోతులు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని కోరారు. 65 ఏళ్లు దాటిన వీఆర్‌ఏలు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గజపతినగరం తహసీల్దార్ ఎం.అరుణకుమారికి, బొండపల్లి ఆర్‌ఐకు వినతిపత్రాలు అందజేశారు. వీఆర్‌ఏలు ఆర్.రామారావు, బి.శ్రీను, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వరి ఉభాలు ప్రారంభం



జగ్గయ్యపేటలో ట్రాక్టరుతో దమ్ముచేస్తున్న రైతు



వరినారు తీస్తున్న మహిళలు

వేపాడ: వర్షాలు కురుస్తుండడంతో మండలంలోముందుగా వరి నారు పోసిన రైతులు ఖరీఫ్ వరినా ట్లు ప్రారంభించారు. జగ్గయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు గురువారం దమ్ములు చేసి, శుక్రవారం వరి నాట్లు వేశారు. మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 4,350 హెక్టార్లు కాగా పూర్తిస్థాయిలో నాట్లు పడే అవకాశం ఉందని ఏఓ యశ్వంతరావు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు సిద్ధం చేశామని చెప్పారు.